ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక



# జనసేన పార్టీ ఆవిర్భావ వేడుకలు



**ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్:**

జిల్లాలోని సిర్పూర్ తాలూకాలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా యువజన విభాగం అడ్‌హాక్ కమిటీ సభ్యుడు అల్లూరి సాయి కుమార్, జిల్లా నాయకుడు ఈర్ల సునీల్ పాల్గొని ప్రసంగించారు. రానున్న రోజుల్లో సిర్పూర్ నియోజకవర్గంలో జనసేన పార్టీ జెండా ఎగురవేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారానికి పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కొందరిని క్రియాశీల సభ్యత్వంలో చేర్చారు. ఈనెల 17వ తేదీ వరకు సభ్యత్వ నమోదు కొనసాగుతుందని తెలిపారు. సభ్యత్వంతో పాటు ఇన్సూరెన్స్, ప్రమాద భీమా వంటి ప్రయోజనాలు సామాన్య ప్రజలకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. జనసైనికులు అందరూ క్రియాశీల సభ్యులుగా నమోదు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ నాయకులు పోతులు ప్రవీణ్, శెట్టి రాజేష్, అక్కనపెల్లి బాలేష్, ఎస్కే ఇక్బాల్, ఆర్నకొండ రవి, రేగళ్ల నవీన్, మాటూరి అశోక్, పెరుగు మనీష్ తదితరులు పాల్గొన్నారు.

# చేపల్లో వింత వైరస్

## కొళ్ల వ్యర్థాలతో చెరువులు కలుషితం

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:**

కొళ్ళ వ్యర్థాలతో చేపల పెంపకం జరుగుతున్న నేపథ్యంలో కొన్ని చెరువుల్లో చేపల్లో కొత్త రకం వైరస్ గుర్తించినట్లు జిల్లా వెటర్నరీ అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలు కొంతకాలం చేపల వినియోగంపై జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కల్లూరు, మదిర, వైరా, సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి మండలాల్లోని పలు చెరువులను లీజుకు తీసుకున్న ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన చేపల పెంపకందారులు విచ్చలవిడిగా కొళ్ళ వ్యర్థాలను ఉపయోగిస్తున్నట్లు సమాచారం. దీంతో చెరువులు, కుంటలు కలుషితమై జలపుష్పాలు విషతుల్యంగా మారుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత రెండు రోజులుగా కొన్ని చెరువుల్లో బయటపడుతున్న చేపలను పరీక్షించగా కొత్త రకం వైరస్ ఉన్నట్లు జిల్లా వెటర్నరీ వైద్యులు గుర్తించారు. ఖమ్మం శివార్లలోని చెరువుల్లో లభించిన చేపల నమూనాలను పరిశీలించగా ఈ వైరస్ వెలుగుచూసినట్లు వివరించారు. ఈ వైరస్ సోకిన చేపలను తింటే ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశముందని, వింతగా ప్రవర్తించే లక్షణాలు కనిపించవచ్చని హెచ్చరించారు. ప్రజలు కొన్ని రోజుల పాటు చేపల వంటకాల వినియోగాన్ని నివారించడం మంచిదని సూచించారు. చెరువుల్లో కొళ్ళ వ్యర్థాల వినియోగంపై సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# పేదల సొంతింటి కల సాకారం చేస్తున్న ప్రభుత్వం



**ఉద్యమ కెరటం, తల్లాడ:**

పేదల సొంతింటి కలను ప్రభుత్వం సాకారం చేస్తుందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలోని తల్లాడ మండలం పాత పినపాక గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాళ్లూరు మురళి–నాగమణి దంపతుల ఇందిరమ్మ ఇల్లు, తోకల చుక్కమ్మ–లక్ష్మయ్య దంపతుల ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ భూమిలేని నిరుపేద ప్రజలకు సుమారు 88 మందికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇళ్ల పట్టాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నాయకత్వంలో అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలు అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం పాత పినపాక గ్రామానికి చెందిన అమరం రాము గారి మనవడు బారసాల కార్యక్రమంలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కల్లూరు ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ చౌదరి, తల్లాడ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఏఎంసీ వైస్ చైర్మన్ కాపా సుధాకర్, పాత పినపాక సర్పంచ్ గుర్రం శ్రీను, ఉప సర్పంచ్ స్వరూపరాణి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# గ్రామీణ నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించాలి

- **ఇన్నోవేషన్ పంచాయత్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:**



మారుమూల గ్రామాల నుంచి వెలువడుతున్న సృజనాత్మక ఆలోచనలకు ప్రోత్సాహం అందించి వాటిని పారిశ్రామిక స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యంగా తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఇన్నోవేషన్ పంచాయత్' కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడిందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాలకు చెందిన సుమారు 40 మందికి పైగా యువ ఆవిష్కర్తలు, విద్యార్థులు తమ వినూత్న ప్రాజెక్టులు, ఆలోచనలను ప్రదర్శించారు. ముఖ్యంగా వ్యవసాయానికి ఉపయోగపడే పరికరాలు, పర్యావరణహిత ఇంధన వనరులు, ఆరోగ్య రంగానికి సంబంధించిన నమూనాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి కేవలం మెట్రో నగరాలకు మాత్రమే పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాల్లోనూ ఉన్న ప్రతిభను వెలికితీయడం అవసరమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని నూతన ఆవిష్కరణలను గుర్తించి వాటిని వ్యాపార మార్గాలుగా మలిచేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. స్థానికంగా అభివృద్ధి చెందుతున్న స్టార్టప్‌లకు ప్రోత్సాహం అందించేందుకు ఆదిలాబాద్ జిల్లాలో ప్రత్యేకంగా ఇన్నోవేషన్ ఫండ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ నుంచి వచ్చిన నిపుణుల బృందం ఆవిష్కర్తలతో ప్రత్యక్షంగా చర్చించి వారి ఆలోచనలను మరింత మెరుగుపర్చుకునే విధంగా మార్గనిర్దేశం చేశారు. ఐడియా వ్యాలిడేషన్, ప్రోటోటైపింగ్, గోటు మార్కెట్ స్ట్రాటజీ, నిధుల సమీకరణ, మార్కెటింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం వినూత్న ఆలోచనలతో పాల్గొన్న యువకులు, విద్యార్థులతో కలెక్టర్ ముఖాముఖి మాట్లాడి వారి ఆవిష్కరణల గురించి తెలుసుకున్నారు. ఆవిష్కర్తలను అధికారులు మెమెంటోలు, పూల మొక్కలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిపిఓ రమేష్, డిపిఆర్ఓ ఇ.విష్ణువర్ధన్, పట్టణ తహశీల్దార్ శ్రీనివాస్, ఈడీఎం రవి, రెడ్కో డిఎం శ్రీనివాస్, వివేకానంద కళాశాల ప్రతినిధులు ప్రణయ్, రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా సాగాలి

- **పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ రాజర్షి షా**

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:**



జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షలను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. శనివారం పదో తరగతి పరీక్షలు ప్రారంభమైన నేపథ్యంలో ఆదిలాబాద్ పట్టణంలోని పలు పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలోని ఓల్డ్ హౌసింగ్ బోర్డు ప్రాంతంలో ఉన్న సరస్వతి శిశు మందిర్, వినాయక్ చౌక్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నం.2 పరీక్షా కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రతి గదిని పరిశీలిస్తూ పరీక్షలు జరుగుతున్న తీరును నిశితంగా గమనించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వెలుతురు, ఫ్యాన్లు, తాగునీరు, బెంచీలు వంటి కనీస మౌలిక వసతులు ఉన్నాయా అనే విషయాలను తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో ఆరా తీస్తూ, హాజరు శాతంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసేలా చూడాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పూర్తి పారదర్శకతతో పరీక్షలను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు చేసిన ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్, పరీక్షలు ముగిసే వరకు ఇదే అప్రమత్తత కొనసాగించాలని సూచించారు. కలెక్టరట్ వెంట పట్టణ తహశీల్దార్ శ్రీనివాస్, ఆయా పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

# ప్రతి పేదవాడికి సొంత ఇల్లే లక్ష్యం

- **ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశంలో ఆడే గజేందర్**

**ఉద్యమ కెరటం, తాంసి:**



ప్రతి పేదవాడు సొంతింటిలో సుఖంగా జీవించాలనే ఆకాంక్ష ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిది అని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్ అన్నారు. తాంసి మండలంలోని కప్పర్ల గ్రామంలో ఆ గ్రామ సర్పంచ్ గండ్రత్ అరుణ్‌తో కలిసి శనివారం పలు లబ్ధిదారుల నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గట్ల ప్రీతి–రాకేష్, శనగారపు భాగ్యమ్మ–లాస్మా గౌడ్, అరుగుల లక్ష్మి–ఆశన్న దంపతుల ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల సొంతింటి కల నెరవేరుతోందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నాయకత్వంలో పేదలకు గౌరవప్రదమైన నివాసం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామపంచాయతీల్లో కొత్తగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లకు లబ్ధిదారులు గృహప్రవేశాలు చేస్తూ ఆనందోత్సాహాలతో సంబరాలు జరుపుకుంటున్నారని తెలిపారు. ప్రతి గ్రామంలో ఈ పథకం పండుగ వాతావరణాన్ని సృష్టిస్తోందని పేర్కొన్నారు. అలాగే ఏప్రిల్ నుంచి మరో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు జరగనుందని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిందన్నారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపుతూ భద్రతతో కూడిన నివాసాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ కౌడల నారాయణ, మాజీ డీసీసీబీ చైర్మన్ అడ్డి బోజారెడ్డి, తలమడుగు మాజీ జెడ్పిటీసీ గోక గణేష్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కౌడాల సంతోష్, ఉపసర్పంచ్ నర్సింలు, వార్డు సభ్యులు ఆశన్న, ప్రభాకర్, ఆత్మ డైరెక్టర్లు గంగయ్య, గంగన్న, రామకృష్ణ, మహేందర్, రాజబలి, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ హక్కుల సాధనలో యువత ముందుండాలి

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:**



యువత సమాజంలో గొప్ప మార్పులు తీసుకురావాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్ అన్నారు. శనివారం వేంసూర్ రోడ్డులోని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కార్యాలయంలో యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షులు కోమటి తిరుమలరావు అధ్యక్షతన ఐదు మండలాల యువతతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత తలుచుకుంటే సమాజంలో ఏదైనా సాధించే శక్తి ఉందన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్య, ఉద్యోగం, రాజకీయాలు, వ్యాపార రంగాల్లో తమదైన ముద్ర వేయాలని సూచించారు. ముఖ్యంగా బీసీ యువత బీసీల అణిచివేతకు వ్యతిరేకంగా నిలబడి న్యాయబద్ధమైన హక్కుల సాధన కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. బీసీల రాజ్యాధికార ఉద్యమంలో యువత పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. అనంతరం నియోజకవర్గంలోని వివిధ మండలాల యువతకు బాధ్యతలు అప్పగించారు. సత్తుపల్లి పట్టణ అధ్యక్షులుగా వేముల వెంకటేశ్వరరావు, వేంసూర్ మండల యువజన సంఘం అధ్యక్షులుగా మిట్టపల్లి శ్రీనాథ్ భార్గవ్, పెనుబల్లి మండల యువజన సంఘం అధ్యక్షులుగా రాయల శ్రావణ్ కుమార్, కల్లూరు మండల యువజన సంఘం అధ్యక్షులుగా కొండపల్లి మురళీకృష్ణలకు నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం సత్తుపల్లి నియోజకవర్గ అధ్యక్షులు దుస్సా వెంకటేశ్వర్లు, బీసీ సంఘం సీనియర్ నాయకులు డాక్టర్ పెద్దిరాజు, యువజన విభాగం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కందుకూరి మరేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ సిలిండర్ల కొరత లేదు

• జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:**



జిల్లాలో గృహ అవసరాలతో పాటు విద్యాలయాలు, ఆసుపత్రులకు అవసరమైన ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఎలాంటి కొరత లేదని, సరిపడా నిల్వలు అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ రాజేశ్వర్‌తో కలిసి గ్యాస్ ఏజెన్సీ డీలర్లు, చమురు కంపెనీల సేల్స్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో గ్యాస్ కొరత ఏర్పడినట్లు జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ప్రతిరోజూ బుకింగ్, సరఫరా వివరాలపై నివేదిక సమర్పించాలని డీలర్లను ఆదేశించారు. ముఖ్యంగా ఆసుపత్రులు, వసతి గృహాలు, అనాధ శరణాలయాలకు ప్రభుత్వ నిబంధనల మేరకు నిరంతరాయంగా గ్యాస్ సరఫరా చేయాలని సూచించారు. గృహ అవసరాలకు కేటాయించిన డొమెస్టిక్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు మళ్లించినా, అక్రమంగా నిల్వ చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. హోటళ్లు, రెస్టారెంట్లలో తనిఖీలు చేపట్టేందుకు పౌర సరఫరాల అధికారులు, డీటీలు, ఎస్‌ఐలతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై నిత్యావసర వస్తువుల చట్టం కింద కేసులు నమోదు చేస్తామని చెప్పారు. ఆన్‌లైన్ బుకింగ్ చేసుకున్న వినియోగదారులకు సకాలంలో సిలిండర్లు అందేలా చూడాలని, డెలివరీ బాయ్స్ సిలిండర్లను దారి మళ్లించకుండా డీలర్లు పర్యవేక్షించాలని ఆదేశించారు. అలాగే సిలిండర్లలో గ్యాస్ తూకం ఖచ్చితంగా ఉండేలా తూనికల కొలతల శాఖ అధికారులు నిరంతరం తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. అంతకుముందు చమురు కంపెనీ ప్రతినిధులతో కలెక్టర్ గూగుల్ మీట్ నిర్వహించి ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ల నిల్వలు, ఆన్‌లైన్ బుకింగ్ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ సురేందర్, అటవీ శాఖ అధికారులు ప్రశాంత్ బాజీరావ్ పాటిల్, ఆర్డీఓ స్రవంతి, జిల్లా పౌర సరఫరాల అధికారి నందిని, వివిధ సంక్షేమ శాఖల అధికారులు, ఆయిల్ కార్పొరేషన్ ప్రతినిధులు, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

# వరకట్నానికి దూరంగా ఉండాలని కోలం సంఘం తీర్మానం

• సాంప్రదాయ పద్ధతుల్లోనే వివాహాలు నిర్వహించాలని నిర్ణయం

**ఉద్యమ కెరటం, సాత్నాల:**



వరకట్నానికి దూరంగా ఉండాలని, సాంప్రదాయ పద్ధతుల్లోనే వివాహాలు నిర్వహించాలని ఆదిమ గిరిజన కోలం సంఘం పెద్దలు తీర్మానించారు. సాత్నాల మండలం న్యూ టెమ్రిగూడలో శనివారం సాత్నాల, బేల, జైనాథ్ మండలాలకు చెందిన సంఘ పెద్దలు, పూజారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వరకట్నం అడగకూడదని, ఇవ్వకూడదని సంఘ సభ్యులు ప్రమాణం చేశారు. ఎర్రబొట్టు కార్యక్రమాన్ని అవసరానికి అనుగుణంగా నిర్వహించుకోవాలని నిర్ణయించారు. ఆడంబరాలకు వెళ్లి అప్పుల పాలవద్దని, పెళ్లి పందిరి సంప్రదాయ పద్ధతిలోనే ఏర్పాటు చేయాలని సూచించారు. లక్షల రూపాయల విలువ చేసే రెడీమేడ్ పందిళ్లు వేయకూడదని, పెళ్లి కార్యక్రమాల్లో పూజారులు, పెద్దలు, కుటుంబ సభ్యులు మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నిర్ణయించారు. డీజేలు పెట్టకుండా ఢోలు వాయిద్యాలతోనే వేడుకలు నిర్వహించాలని అన్నారు. వరకట్నం కారణంగా అనేక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్న నేపథ్యంలో ఈ తీర్మానాలు చేసి ఈ ఏడాది నుంచే అమలు చేయాలని నిర్ణయించుకున్నట్లు కోలం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సోనేరావు, జిల్లా అధ్యక్షుడు గోవింద్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామ రూపేష్, గ్రామ ఉప సర్పంచ్ అయ్యూ, పలు గ్రామాల పటేళ్లు మడవి రాజు, ఆత్రం నాగరావు, కొడప రాము, ఆత్రం లక్ష్మణ్, మడవి బింరావు తదితరులు పాల్గొన్నారు.

# ముందస్తు అడ్మిషన్లు చేపట్టన్నే వారిపై చర్యలు తీసుకోవాలి

**ఉద్యమ కెరటం, బెల్లంపల్లి:**



వచ్చే విద్యా సంవత్సరానికి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలు అడ్మిషన్ల కోసం ప్రచారం ప్రారంభించడం అనైతికమని తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ అల్లి సాగర్ యాదవ్ అన్నారు. విద్యార్థుల పరీక్షలు కూడా పూర్తికాకముందే ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రతి స్కూల్ వద్దకు వెళ్లి తమ విద్యాసంస్థలే ఉత్తమమని ప్రచారం చేస్తూ పీఆర్‌ఓలను నియమించి, కరపత్రాలు పంచుతూ అడ్మిషన్ల కోసం ప్రయత్నిస్తున్నారని తెలిపారు. వేల నుంచి లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను అయోమయంలో పడేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి పాఠశాల, కళాశాల సిబ్బందికి కనీసం 10 అడ్మిషన్ల లక్ష్యాన్ని నిర్దేశించి, అది నెరవేర్చకపోతే ఉద్యోగం కోల్పోతారనే విధంగా బెదిరింపులు చేస్తున్నారని చెప్పారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు అనుమతులు ఇచ్చిన విద్యాధికారులు వాటిని నియంత్రించడంలో పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. అధిక ఫీజుల వసూళ్లను నియంత్రించలేక పోతున్నారని, అక్రమ అడ్మిషన్లను కూడా అడ్డుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. వెంటనే విద్యాధికారులు స్పందించి నిబంధనలు ఉల్లంఘిస్తూ అడ్మిషన్లు చేపడుతున్న పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే వాటి గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ సంఘం ఆధ్వర్యంలో ప్రచార ఆర్భాటాలతో అడ్మిషన్లు చేస్తున్న పాఠశాలలు, కళాశాలల క్యాంపెయిన్ బృందాలను అడ్డుకొని వారి కరపత్రాలు, ప్రచార సామాగ్రిని దగ్ధం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆదిత్య, వెంకటేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# జూనియర్ కళాశాలలో తరగతులు ప్రారంభించాలి

**ఉద్యమ కెరటం, తాండూర్:**




మండలంలో నూతనంగా మంజూరైన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2026–27 విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, విద్యార్థి సంఘాలు, యువజన నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. శనివారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల నాయకులు మాట్లాడుతూ వెనుకబడిన తాండూర్ మండలానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేయించడంలో ఎమ్మెల్యే చూపిన చొరవకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కళాశాల ప్రారంభం ద్వారా పేద విద్యార్థుల ఉన్నత విద్య కల సాకారం కానుందని పేర్కొన్నారు. మండల కేంద్రంలో సరిపడా సీట్లు కలిగిన ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు బెల్లంపల్లి, మంచిర్యాల వంటి పట్టణాలకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. సుమారు 20 నుంచి 30 కిలో మీటర్ల ప్రయాణం గిరిజన విద్యార్థులకు, ముఖ్యంగా బాలికలకు రవాణా, భద్రత పరంగా పెద్ద సమస్యగా మారిందన్నారు. ప్రైవేట్ కళాశాలల ఫీజులు చెల్లించే స్థోమత లేక, ప్రయాణ ఖర్చులు భరించలేక అనేక మంది ప్రతిభావంతులైన విద్యార్థులు పదో తరగతితోనే చదువు మానేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికే ప్రవేశాల ప్రక్రియ మొదలయ్యేలా చూడాలని, శాశ్వత భవనం నిర్మాణం పూర్తయ్యే వరకు అందుబాటులో ఉన్న ఏదైనా ప్రభుత్వ భవనంలో తాత్కాలికంగా తరగతులు నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యేను కోరారు.

# విద్యుత్ లైన్ తొలగించి ఇంటి నిర్మాణానికి సహకరించాలి

**ఉద్యమ కెరటం, తల్లాడ:**



ఖమ్మం జిల్లా తల్లాడ మండలం తల్లాడ గ్రామపంచాయతీ పరిధిలోని నారాయణపురం గ్రామానికి చెందిన సంఘసాని శిరీషకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ఇల్లు నిర్మాణంలో భాగంగా గోడల నిర్మాణం పూర్తి చేసుకున్నప్పటికీ ఇంటి పైభాగంలో ఉన్న విద్యుత్ లైన్ కారణంగా నిర్మాణ పనులు నిలిచిపోయాయని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి పైభాగంలో ఉన్న విద్యుత్ లైన్ కారణంగా సెంట్రింగ్ పెట్టడానికి ఎవరూ ముందుకు రావడం లేదని, దీంతో ఇంటి నిర్మాణ పనులు నిలిచిపోయాయని తెలిపారు. సమయానికి ఇల్లు నిర్మించుకోకపోతే ప్రభుత్వం నుంచి వచ్చే బిల్లు ఆగిపోతుందనే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ స్పందించి సహకరించాలని కోరారు. అలాగే విద్యుత్ శాఖ అధికారులు స్పందించి స్లాబ్ వేసుకునేలా విద్యుత్ లైన్‌ను పక్కకు మార్చి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# ఆదాయ వనరులు పెంచాలి

• ఎమ్మెల్యే హరీష్ బాబు

• రూ.52.5 కోట్ల కాగజ్‌నగర్ మున్సిపల్ బడ్జెట్



**ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్:**

కాగజ్‌నగర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఆర్థిక సంవత్సరం 2026–27కు గాను రూ.52.5 కోట్ల అంచనాతో మున్సిపల్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక బడ్జెట్ సమావేశంలో సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ఆదాయ వనరులను పెంచుకొని, వ్యయాన్ని తగ్గించే దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. అనంతరం బడ్జెట్ పద్దులపై సభ్యులతో చర్చించి అభివృద్ధి కార్యక్రమాలపై అభిప్రాయాలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షాహిన్ సుల్తానా, ఎమ్మెల్సీ దండే విఠల్, అడిషనల్ కలెక్టర్ డేవిడ్, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధికి చర్యలు వేగవంతం



**ఉద్యమ కెరటం, తీర్యాణి:**

ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గ్రామ అభివృద్ధికి చర్యలు వేగవంతం చేసినట్లు గ్రామ సర్పంచ్ మడావి పార్వతీ అంబారావు అన్నారు. ఇందులో భాగంగా శనివారం మండలంలోని ఎదులపాడ్ గ్రామ పంచాయతీలో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రామంలో పలు అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని నర్సరీని సందర్శించి మొక్కల పెంపకాన్ని పరిశీలించారు. మొక్కలను సంరక్షించి వంద శాతం పెంపకం జరిగేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. అలాగే ఎదులపాడ్ గ్రామంలో కోట్నాక యశ్వంత్ రావు ఇంటి వద్ద తాగునీటి బోర్ మరమ్మతులు చేపట్టారు. గ్రామ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి అశోక్, ప్రధానోపాధ్యాయుడు చిక్రం భగవంతరావు, మాజీ ఎంపీటీసీ కోట్నాక యశ్వంత్ రావు తదితరులు పాల్గొన్నారు.

# సర్వ మతాలను గౌరవించాలి

ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:**

సర్వ మతాలను గౌరవించాలని విశ్వశాంతి పాఠశాల ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు అన్నారు. శనివారం సత్తుపల్లి పట్టణంలోని విశ్వశాంతి పాఠశాల ఆధ్వర్యంలో ముందస్తు రంజాన్ (ఈద్ ఉల్ ఫితర్) వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముస్లింలకు ఎంతో పవిత్రమైన రంజాన్ మాసం క్రమశిక్షణ, దయ, సహనం, సేవాభావం, స్వీయ నియంత్రణ వంటి మంచి గుణాలను పెంపొందిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా రంజాన్ ప్రాధాన్యతను తెలియజేసే విధంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. పేదవారికి దానం చేసే అలవాటు పెంపొందించేందుకు "జకాత్" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐక్యతను పెంపొందించే ఉద్దేశంతో "ఇఫ్తార్ విందు" ఏర్పాటు చేశారు. సర్వమత శ్రేయస్సు కోసం నమాజ్ ప్రార్థనలు కూడా నిర్వహించారు. అదేవిధంగా విద్యార్థులు రంజాన్ ప్రాధాన్యతను తెలిపే నృత్యాలు ప్రదర్శించారు. ఆనందం, ఆహ్లాదం పంచుకునేందుకు "మెహెందీ" కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని "ఈద్ ముబారక్" అంటూ శుభాకాంక్షలు తెలియజేశారు. రంజాన్ పండుగ సోదరభావం, సమానత్వం, ప్రేమ, దయ, శాంతి వంటి విలువలను పెంపొందిస్తుందని తెలిపారు. ఉపవాసం ద్వారా స్వీయ నియంత్రణ, సహనం అలవడుతుందని, దేవునికి దగ్గర కావటానికి ప్రార్థనలు దోహదపడతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నూతన గృహప్రవేశానికి బోరంచు



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:**

మండలంలోని తేజాపూర్ గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అల్లూరి ప్రఫుల్ చందర్ రెడ్డి–కృష్ణవేణి దంపతుల నూతన గృహప్రవేశ కార్యక్రమానికి తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి శనివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన దంపతులను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. కుటుంబ సభ్యులతో కలిసి కొత్త ఇంటిలో సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కూనింటి దామోదర్ రెడ్డి, ఏలేటి రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:**

నర్సరీల్లో పెంచుతున్న మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీఓ శేఖర్ సూచించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని నర్సరీని సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ ఏలేటి నీలిమ రవీందర్ రెడ్డితో కలిసి నర్సరీలో పెంచుతున్న మొక్కల స్థితిని పరిశీలించారు. మొక్కల సంరక్షణలో నిర్లక్ష్యం వహించకుండా, నర్సరీలో ఉన్న మొక్కలను వంద శాతం సక్రమంగా పెంచేందుకు పంచాయతీ సిబ్బంది శ్రద్ధ వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోతి గులాబ్ సింగ్, పంచాయతీ కార్యదర్శి నర్సారెడ్డి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.


## వివాహ వేడుకల్లో సోయం బాపురావు



**ఉద్యమ కెరటం, సొనాల:**

మండలంలోని పార్డి–బి గ్రామానికి చెందిన తోడసం వంశస్తుల ఆహ్వానం మేరకు మాజీ ఎంపీ, రాజ్ గోండ్ సేవాసమితి రాష్ట్ర అధ్యక్షులు సోయం బాపురావు శనివారం వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వధూవరులను ఆశీర్వదించి పట్టు వస్త్రాలు సమర్పించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నర్సరీ అభివృద్ధికి ప్రాధాన్యత



**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:**

నర్సరీ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు గ్రామ సర్పంచ్ అబ్దుల్ రెహమాన్ అన్నారు. 99 రోజుల ప్రజాపాలన –ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం గుడిహత్నూర్ మండలం డోంగర్గావ్ గ్రామ పంచాయతీలో నర్సరీలో మొక్కల బాగోగులను పరిశీలించారు. నర్సరీలో శుభ్రతను ఖచ్చితంగా పాటిస్తూ మొక్కలకు సరైన సమయంలో నీరు అందిస్తున్నామని పేర్కొన్నారు. మొక్కలు ఆరోగ్యంగా పెరిగేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని చెప్పారు. అదనంగా కొత్తగా విత్తనాలు వేయడం కోసం ప్రతిపాదనలు కూడా చేసినట్లు తెలిపారు.

# ఘనంగా పోచమ్మ తల్లి జాతర ఉత్సవాలు





**ఉద్యమ కెరటం, హత్నూర:**

సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని షేర్ ఖాన్ పల్లి గ్రామ శివారులో స్వయంభుగా వెలిసిన శ్రీశ్రీశ్రీ పలుగుమీది నల్ల పోచమ్మ తల్లి జాతర మహోత్సవాలు కొనసాగుతున్నాయి. జాతర ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారిని ప్రత్యేక పూల ఆభరణాలతో అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. రెండవ రోజు జాతర ఉత్సవాల్లో భాగంగా వివిధ గ్రామాల ప్రజలు, స్థానిక భక్తులు అగ్ని గుండాలపై నడుచుకుంటూ వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ మాచర్ల దేవనాథం, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్ శర్మ మాట్లాడుతూ గ్రామ సర్పంచ్‌తో పాటు స్థానిక పెద్దల ఆధ్వర్యంలో జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇక్కడి అమ్మవారు స్వయంభుగా వెలిసిన దేవత అని, భక్తి భావంతో పూజలు చేస్తే కోరుకున్న కోరికలు నెరవేరుతాయని పేర్కొన్నారు. అమ్మవారి బ్రహ్మోత్సవాలకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో పాటు సంగారెడ్డి జిల్లాలోని అనేక ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వస్తారని తెలిపారు. హైదరాబాద్ నగరానికి సమీపంలో ఉండటంతో నగర ప్రజలు కూడా భారీ సంఖ్యలో వస్తారని చెప్పారు. రేపు బండ్లు బోనాలు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారి దర్శనం చేసుకోవాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు.

# సొంతిల్లు సమాజంలో గౌరవప్రదమైన స్థానం కల్పిస్తుంది

**ఉద్యమ కెరటం, బోథ్:**



సమాజంలో సొంతిల్లు ఉండటం ప్రతి వ్యక్తికి గౌరవప్రదమైన స్థానం కల్పిస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నరేష్ జాదవ్ అన్నారు. శనివారం బోథ్ పట్టణంలోని న్యూ కాలనీలో నిర్మాణం పూర్తయిన ఇందిరమ్మ ఇండ్లను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి, ఇంటి యజమానులతో కలిసి గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ప్రతి పేద కుటుంబానికి కూడు, గుడ్డతో పాటు నివసించేందుకు గౌరవప్రదమైన ఇల్లు ఉండాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని పేర్కొన్నారు. సొంతింటి కల నెరవేరితే వ్యక్తులు సమాజంలో గౌరవంగా నిలబడతారని అన్నారు. ఇంకా కొన్ని రోజుల్లో మరిన్ని ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తూ అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ మల్లేష్, మాజీ ఎంపీటీసీ షేక్ రజియా బేగం, వార్డు సభ్యులు షేక్ షాకీర్, పద్మారావు, సంతోష్, గిరిజ బాయ్, కౌసర్, పోతన్న, మాజీ వార్డు సభ్యులు తుకారం, శ్రీకాంత్ రెడ్డి, ప్రవీణ్ తదితర ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు

**ఉద్యమ కెరటం, తాండూర్:**



పదవ తరగతి పరీక్షలు మండల కేంద్రంలోని తాండూర్ జెడ్‌పీహెచ్ఎస్ పాఠశాల, విద్యా భారతి ఉన్నత పాఠశాలలో శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మండల విద్యాధికారి దుర్గం శ్రీనివాస్ మాట్లాడుతూ మొత్తం 418 మంది విద్యార్థులకు గాను 416 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు. ఒక విద్యార్థి దివ్యాంగుడు కావడంతో ఈరోజు అతనికి పరీక్ష లేదని చెప్పారు. అలాగే తంగళ్లపల్లి జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఓ విద్యార్థి గతంలో పదవ తరగతి పరీక్షల రుసుము చెల్లించినప్పటికీ ఆత్మహత్యకు పాల్పడడంతో అతడిని గైరాజరుగా పరిగణించామని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిధిలో 100 మీటర్ల వరకు సెక్షన్ 144 అమల్లో ఉందని, ప్రతి కేంద్రం వద్ద పోలీసు సిబ్బందిని నియమించినట్లు వివరించారు.

# జిల్లాలో వంట గ్యాస్ కొరత లేదు

**• కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**ఉద్యమ కెరటం, ఖమ్మం:**



జిల్లాలో ఎల్‌పీజీ వంట గ్యాస్ కొరత లేదని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి స్పష్టం చేశారు. ఖమ్మం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం గ్యాస్ ఏజెన్సీల డీలర్లు, గ్యాస్ కంపెనీల సేల్స్ ఆఫీసర్లు, సంబంధిత అధికారులతో ఎల్‌పీజీ గ్యాస్ సరఫరా పరిస్థితిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గృహ అవసరాలకు సరిపడా వంట గ్యాస్ నిల్వలు ఉన్నాయని తెలిపారు. గ్యాస్ కొరత ఉందని ప్రచారం జరుగుతున్న వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు. ప్రజలు ఆందోళన చెందకుండా అవసరం ఉన్నప్పుడే గ్యాస్ సిలిండర్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. అలాగే గృహ అవసరాలకు వినియోగించే వంట గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో గ్యాస్ సరఫరా నిరంతరం సక్రమంగా జరిగేలా అధికారులు పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.

## ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

**• అదనపు కలెక్టర్ నాగేష్**

**ఉద్యమ కెరటం, నర్సాపూర్:**

మెదక్ జిల్లా నర్సాపూర్ మున్సిపల్ పట్టణంలో నిర్వహిస్తున్న పదో తరగతి వార్షిక పరీక్షా కేంద్రాన్ని శనివారం జిల్లా అదనపు కలెక్టర్ నాగేష్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్ష గదులను సందర్శించి పరీక్షల నిర్వహణ తీరు, విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికి అవసరమైన ఏర్పాట్లు ఎలా ఉన్నాయో సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, పరిశుభ్రత, భద్రత వంటి మౌలిక సదుపాయాలు సమృద్ధిగా ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. మెదక్ జిల్లాలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. పరీక్షలు పారదర్శకంగా, ఎలాంటి అవకతవకలు లేకుండా నిర్వహించడం అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూ చించారు. ఈ తనిఖీలో తహశీల్దార్ శ్రీనివాస్, పరీక్షా కేంద్ర సిబ్బంది తదితరులు ఉన్నారు.



## పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరం

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:**



ఆదిలాబాద్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు శనివారం మున్సిపల్ కార్యాలయం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ల బృందంతో ఏర్పాటు చేసిన హెల్త్ చెకప్ క్యాంప్‌లో పారిశుద్ధ్య కార్మికులకు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనుష సతీష్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య సేవలు అందించడం ఆనందంగా ఉందన్నారు. వారి ఆరోగ్య పరిరక్షణకు మున్సిపాలిటీ తరపున ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పదవ తరగతి వార్షిక పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ కె.హరిత

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** జిల్లాలో 10 వ తరగతి వార్షిక పరీక్షలను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. శనివారం జిల్లాలోని రెబ్బెన మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి పరీక్ష తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఏప్రిల్ 16వ తేదీ వరకు జిల్లాలో జరగనున్న 10వ తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి సౌకర్యం కలగకుండా త్రాగునీరు, వెలుతురు, ఫ్యాన్లు, నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా పరీక్షల ముఖ్య పర్యవేక్షకులు, శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాలలో అవసరమైన మందులు, ఎండ తీవ్రత దృష్ట్యా ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, వైద్య సిబ్బందిని నియమించాలని తెలిపారు. పరీక్షా కేంద్రాలలో సి సి కెమెరాల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్ష కేంద్రంలోనికి అనుమతించకూడదని, తనిఖీలు చేయాలని తెలిపారు. పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భద్రతా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరీక్షల ముఖ్య పర్యవేక్షకులు, శాఖ అధికారులు, ఇన్విజిలేటర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చర్చలు సఫలం


## మిషన్ భగీరథ కార్మికుల సమ్మె తాత్కాలిక విరమణ



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో మిషన్ భగీరథ కాంట్రాక్ట్ కార్మికుల సమ్మెకు తాత్కాలిక బ్రేక్ పడింది. మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ కార్యాలయంలో అధికారుల సమక్షంలో ఏఐటీయూసీ నాయకులకు, ఎల్ అండ్ టీ యాజమాన్యానికి మధ్య జరిగిన చర్చలు సఫలమయ్యాయి. ఈ చర్చల సందర్భంగా ఈ నెల 20వ తేదీలోపు ఒక నెల జీతం, అలాగే మార్చి 30వ తేదీ నాటికి మిగిలిన బకాయిలన్నీ చెల్లించేందుకు ఎల్ అండ్ టీ యాజమాన్యం అంగీకరించింది. యాజమాన్యం నుంచి స్పష్టమైన హామీ రావడంతో గత మూడు రోజులుగా కొనసాగిస్తున్న సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్, జిల్లా ఉపాధ్యక్షులు ఆత్మకూరు చిరంజీవి ప్రకటించారు. మార్చి చివరి నాటికి పెండింగ్ వేతనాలతో పాటు కార్మికులకు బోనస్ చెల్లించాలని, కనీస వేతనం 26 వేల రూపాయలు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రతి నెలా 5వ తేదీలోపు వేతనాలు చెల్లించని పక్షంలో, మార్చి 31 నుంచి మళ్లీ నిరవధిక సమ్మెకు దిగుతామని ఈ సందర్భంగా యాజమాన్యాన్ని హెచ్చరించారు. ఈ చర్చల్లో మిషన్ భగీరథ ఈఈ రాకేష్, డిప్యూటీ ఈఈ ఇర్ఫాన్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు బాలేశు, ప్రధాన కార్యదర్శి షాకీర్, వర్కింగ్ ప్రెసిడెంట్ జంషద్, ఎల్ అండ్ టీ ప్రతినిధులు, కార్మికులు శివ, అంజి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఉప సర్పంచ్ కుర్చీ తొలగించాలి

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ రూరల్ :** మండలంలోని రాజంపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఉప సర్పంచ్ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కుర్చీని వెంటనే తొలగించాలని వార్డు మెంబర్లు గులం జావిద్ తోపాటు మరి కొందరు వార్డు సభ్యులు గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం సర్పంచ్‌కు తప్ప, ఉప సర్పంచ్‌కు ప్రత్యేక ఆసనం కేటాయించే నిబంధన లేదని, నియమాలకు విరుద్ధంగా ఆ కుర్చీని ఎలా కొనసాగిస్తారని వార్డు సభ్యులు ప్రశ్నించారు. వార్డు సభ్యుల ఆందోళనలు, ఇరుపక్షాల వాదోపవాదాలను విన్న పంచాయతీ కార్యదర్శి ప్రస్తుతానికి పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. ఈ వివాదాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, నియమ నిబంధనల ప్రకారం సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో జనరల్ బాడీ మీటింగ్‌ను ఏడు రోజుల పాటు వాయిదా వేస్తున్నట్లు ఆయన ప్రకటించారు.



# పరిశుభ్రతలో భాగస్వాములు కావాలి

## మున్సిపల్ చైర్ పర్సన్ ఆకాష్, వైస్ చైర్ పర్సన్ ఎండీ అహ్మద్ పిలుపు

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా శనివారం ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 10 వ వార్డులో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ ఎం ఆకాష్ , వైస్ చైర్ పర్సన్ ఎండీ అహ్మద్ , 10 వార్డు కౌన్సిలర్ కె భాగ్య లక్ష్మి, 6 వార్డు కౌన్సిలర్ చిలువేరు వెంకన్న , మున్సిపల్ సిబ్బందితో కలిసి వార్డులో పర్యటించి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ముందస్తు జాగ్రత్త చర్యగా వార్డు అంతటా దోమల మందు స్ప్రే చేయించడంతో పాటు బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించారు. అనంతరం మహిళలకు తడి చెత్త, పొడి చెత్త హానికరమైన వ్యర్థాలను వేరు చేయడంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ సర్వర్ , సానిటరీ ఇన్స్పెక్టర్ రామయ్య , వార్డ్ ఆఫీసర్ భాస్కర్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.






# మురికినీటి సమస్యకు పరిష్కారం

## స్పందించిన కౌన్సిలర్ జేబా షేక్
## పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించిన వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డులో డ్రైనేజీలు పూడికతో నిండిపోవడంతో మురికినీరు రోడ్లపైకి చేరి, కాలనీవాసులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని 20వ వార్డు కౌన్సిలర్ జేబా షేక్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సమద్ గుర్తించారు. ఈ సమస్యపై వారు వెంటనే స్పందించి మున్సిపల్ సిబ్బందితో మాట్లాడి, సమస్య పరిష్కారం కోసం కృషి చేశారు. మున్సిపల్ సిబ్బంది చేపట్టిన ఈ పారిశుద్ధ్య పనులను శనివారం మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యమే తమకు మొదటి ప్రాధాన్యతని, ఎక్కడా మురికినీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. డ్రైనేజీ పూడికతీత పనులను త్వరితగతిన పూర్తి చేసి, కాలనీవాసులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. స్థానిక సమస్యపై తక్షణమే స్పందించిన నాయకులకు వార్డు ప్రజలు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.



# మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

## ఎమ్మెల్యే కోవ లక్ష్మి

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** ఆసిఫాబాద్ పట్టణ కేంద్రంలోని ఏ రోజ్ గార్డెన్స్‌లో శనివారం సాయంత్రం బిఆర్ఎస్ నాయకులు ఎండి. సల్మాన్ ఖాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ,మునిసిపల్ చైర్మన్ మెంగ్రే ఆకాష్, వైస్ చైర్మన్ ఎండి. అహ్మద్, కౌన్సిలర్లతో కలిసి పాల్గొని, వారితో కలిసి ఉపవాస దీక్షను విరమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా అందరూ కలిసి మెలిసి పండుగలను జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. సమాజంలో ఇలాంటి సోదరభావమే శాంతికి, ప్రగతికి మార్గమని ఆమె ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి శ్యాం నాయక్, మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా బిన్ అహ్మద్, కౌన్సిలర్ చిలువేరు వెంకన్న, సాలం బిన్ అహ్మద్, ఉప సర్పంచ్ మామిడి లక్ష్మి, వార్డు మెంబర్ జావిద్ గులాం, బీ ఆర్ ఎస్ టౌన్ అధ్యక్షుడు అహ్మద్ బిన్ అబ్దుల్లా, నాయకులు ఫయాజ్, సయ్యద్ అన్సర్, సయ్యద్ నిసార్, జావీద్, ప్రేమ్, ఉమా, శబ్బీర్, భీంబాయి , ఇమ్రాన్ హష్మీ , వాఖర్ తదితరులు పాల్గొన్నారు.





